## క్లుప్తంగా

### ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

**సీతంపేట:** ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా చూడాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాకు సంబంధించి పలు సూచనలు చేశారు. జాబితాల్లో తప్పులుంటే సరిదిద్దడంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

### మంచి మార్గం అనుసరించాలి

- జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ సెక్రటరీ సన్యాసినాయుడు



జైలు పరిసరాలను పరిశీలిస్తున్న సన్యాసినాయుడు, విజయ్‌రాజ్‌కుమార్

**పాలకొండ:** మనిషి జీవనానికి మంచి మార్గం అనుసరించాలని శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ ఆర్. సన్యాసినాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలు, వారిపై ఉన్న కేసులు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. సూపరింటిండెంట్ బి. జోగులుకు పలు సూచనలు అందించారు.

### సమాజానికి దిక్సూచి 'వెలుగు జాడలు'

**గరుగుబిల్లి:** వైద్యుడు, రచయిత వెంగళ శివన్నాయుడు రాసిన వెలుగు జాడలు అనే గ్రంథం సమాజానికి దిక్సూచిగా నిలుస్తుందని ఉపాధ్యాయుడు కుదమ తిరుమలరావు అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో ఉన్న తన స్వగృహానికి శుక్రవారం వచ్చిన ఉపాధ్యాయుడిని శివన్నాయుడు సాదరంగా ఆహ్వానించి, దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన రాసిన పుస్తకాన్ని ఉపాధ్యాయుడికి అందజేశారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న దోమకాటు, మద్యపానం, ధూమపానం, సుఖజీవన సూత్రాలు వంటి అంశాలు పొందుపరిచిన ఈ పుస్తకం నిజజీవిత సత్యాలు తెలుపుతూ సందేశాత్మకంగా ఉంటుందని ఉపాధ్యాయుడు తెలిపారు.

### కరుణామయుడు ఏసు



దివ్యబలి పూజ చేస్తున్న బిషప్ విజయకుమార్

**భామిని:** మానవాళికి ప్రేమ, కరుణ అందించిన ఏసు కరుణామయుడని శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని దేవుని సందేశాలు వినిపించారు. అనంతరం ఫాదర్స్ కోమేష్ రెడ్డి, బాల జోషఫ్‌లతో కలిసి దివ్యబలి పూజ నిర్వహించారు.

### నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న డీఈఈ, ఏఈ, తదితరులు

**పాలకొండ రూరల్:** రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పాలకొండ పట్టణ, మండలంలోని నవగాం విద్యుత్ సబ్ స్టేషన్ల ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి, డీఈఈ మోహన్ చక్రవర్తి అన్నారు. పట్టణంలో గల ప్రధాన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులను శుక్రవారం వీరు పర్యవేక్షించారు. అలాగే స్తంభాలకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు తీగలు సరిచేసే పనులు చేపట్టారు. విద్యుత్ సమస్యలను స్థానిక కార్యాలయంలో తెలియజేస్తే పరిష్కరిస్తామని చెప్పారు. వారి వెంట ఏఈ శ్యామ్ సుందర్ తెలిపారు.

### మద్యం బాటిళ్ల పట్టివేత

**పాలకొండ రూరల్:** మండలంలోని చిన మంగళాపురం గ్రామానికి చెందిన ఉత్తరకవాటం సింహాచలం అనే వ్యక్తి నుంచి 35 మద్యం బాటిళ్లు శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# అప్రమత్తతే రక్ష



గుమ్మలో గడ్డివాము నుంచి వస్తున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది(ఫైల్)

- చలికాలంలో అగ్నిప్రమాదాలకు ఆస్కారం
- అప్రమత్తతో తప్పించుకునే అవకాశం
- సినిమా థియేటర్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లలో నిబంధనలు పాటించాలి
- ఎగ్జిట్‌కు అవకాశం ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి

**గుమ్మలక్ష్మీపురం:** చలికాలంలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలని, ముప్పు నుంచి తప్పించుకోవచ్చని, ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకుండా సురక్షిత జీవనం గడపవచ్చని చెబుతున్నారు. పూరిళ్లు, గడ్డివాములు, గొడౌన్లు, బహుళ అంతస్తు భవనాలు, ఆస్పత్రులు, హోటళ్లు, దుకాణాల్లో నిబంధనలు ఖచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చు. ముఖ్యంగా చలికాలంలో చలి బారి నుంచి తప్పించుకుని, ఉపశమనం పొందేందుకు ఎక్కడపడితే అక్కడ చలిమంటలు వేస్తుంటారు. వీటి కారణంగా చాలాచోట్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. చలిమంట కాగుతుండగా బట్టలకు నిప్పంటుకుని, పలువురు వృద్ధులు, చిన్నారులు మృతి చెందిన సంఘటనలు చాలా చోట్ల జరిగాయి. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని గుమ్మలక్ష్మీపురం ఇన్‌చార్జ్ అగ్నిమాపక అధికారి డి.శ్రీరామ్‌నాయుడు కోరుతున్నారు.

### ప్రమాదాలకు కారణాలివే..

- దీర్ఘకాలికంగా కొన్ని విద్యుత్ కనెక్షన్లకు స్విచ్ ఆన్ చేసి ఉంచడం, దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు మెయిన్ ఆఫ్ చేయకపోవడం.
- విద్యుత్ పరికరాలు(ఇస్త్రీపెట్టెలు, హీటర్లు, ఒవెన్‌లు, కరెంట్ స్టవ్‌లు)వాడుతూ మధ్య మధ్యలో ఇతర పనులపై దృష్టిపెట్టడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి, ప్రమాదాలు జరుగుతాయి.
- గ్రామీణ ప్రాంతాల్లో పొయ్యి నిప్పులు, చలిమంటలు ఆర్పకుండా వదిలివేయడం.
- పూరిళ్లలో నాణ్యత లేని వైర్లతో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం.
- గ్యాస్ సిలిండర్ల రెగ్యులేటర్ కట్టకుండా వదిలి, వంటగది తలుపులు బిగించి వేయడం.
- కాల్చిన సిగరెట్ పీకలు నిర్లక్ష్యంగా పారవేయడమనేవి ప్రధానంగా ప్రమాదాలకు కారణాలు.

### ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించాలి ఇలా..

- దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు భయంతో పరిగెత్తకుండా కింద పడుకోబెట్టి వేరే దుస్తులను కప్పి, మంటలు ఆర్పివేయాలి.
- కాలిన శరీరంపై చల్లని నీరు పోయకూడదు.
- గదిలో అగ్నిప్రమాదం వల్ల పూర్తిగా పొగ నిండినపుడు బయటకు వచ్చేంత వరకు సాధ్యమైనంత మేర ఆ గాలిని పీల్చకుండా ఉంటే మంచిది.
- ఇంట్లో నుంచి తెచ్చిన వారిని సాధ్యమైనంత వరకు విశాల ప్రదేశంలో ఉంచాలి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇళ్లకు సమీపంలో గడ్డివాములు వేయకూడదు.
- వ్యర్థాలు తగలబెట్టే సమయంలో విధిగా కొంతనీరు దగ్గర ఉంచుకోవడం. • పూరిళ్లల్లో బొగ్గు, కట్టె, పొట్టుపొయ్యిలు వాడేవారు వాటిని పూర్తిగా ఆర్పామా లేదా అనేది ఒకటికి రెండుసార్లు చూసుకోవాలి. • కిరోసిన్, కొవ్వొత్తి దీపాలను మంచాలు, బీరువాలకు సమీపంలో ఉంచి, వదిలి వేయకూడదు. • గ్యాస్ లీక్ అనుమానాలు వస్తే వెంటనే కిటికీలు తలుపులు తెరవాలి. గదిలోకి గాలి రావడానికి ఏర్పాట్లు చేయాలి.

### ఫైర్ ఎగ్జిట్స్ తప్పనిసరి..

షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, సినిమా థియేటర్లు, రైస్‌మిల్లులు, పెట్రోల్ బంకులు, ఆస్పత్రులు, స్కూల్ బస్సుల్లో తప్పనిసరిగా ఫైర్ ఎగ్జిట్స్ ఉండాలి. వీటి ద్వారా చాలావరకు ప్రమాదాలు, ప్రమాద తీవ్రతను అదుపుచేయవచ్చు.

### తక్షణమే సమాచారం ఇవ్వాలి..

గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలతో పాటు కొమరాడ మండలంలోని నాగావళి నదికి ఇవతలివైపు ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలి. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అగ్నిమాపక కేంద్రం కార్యాలయంలో ఉన్న 08963-223322, 7075095055 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి, ప్రమాదం సమాచారం ఇవ్వాలి.

## సకాలంలో బిల్లుల చెల్లింపు



మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ పీడీ రమేష్

**గుమ్మలక్ష్మీపురం:** గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నట్లు గృహ నిర్మాణ శాఖ పీడీ టి.రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన 2021-22 ఆర్థికసంవత్సరంలో పార్వతీపురం మన్యం జిల్లాలో 7,306 పీఎంఏవై ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 1139 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. గిరిజన తెగల్లోని అట్టడుగు వర్గాల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై జన్‌మన్ పథకం పేరిట ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. దీనికోసం సర్వే జరుగుతోందని, సర్వేలో 9904 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే వీరిలో 3058 మందికి ఇదివరకే ఇళ్లు ఉన్నందున వారిని అనర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. పీఎంఏవై జన్‌మన్ పథకం ద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు కేటాయించగా, అందులో ఉపాధి హామీ వేతనం కింద రూ.18 వేలు, మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లు కోరుతున్న సవర, గదబ వర్గాల్లోని అర్హులకు ఇళ్ల మంజూరుకు రిజిస్ట్రేషన్ చేస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట ఏఈ రెడ్డి శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గెంబలి రమేష్, తదితరులు ఉన్నారు.

## అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

**గరుగుబిల్లి:** ప్రపంచ మేధావి, రాజ్యాంగ రూపశిల్పి, సమసమాజ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 206 అడుగుల అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ పురస్కరించుకుని, స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని, ఆయన చూపిన బాటలో మనమంతా నడిచి, రాజ్యాంగ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు, అభివృద్ధి కోసం ఆయన ఎంతగానో పాటుపడ్డారన్నారు. ఆయన కృషి ఫలితంగా ఎన్నో దళిత కుటుంబాల్లో వెలుగులు నెలకొన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఆ మహానుభావుడి జీవిత చరిత్రను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏపీవో ఎం.గౌరీనాథ్, జేఈ ఎ.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

**పాలకొండ రూరల్:** మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు చేపడతామని పాలకొండ ఎస్సై హేమంత్‌కుమార్ అన్నారు. పాలకొండ-శ్రీకాకుళం, సీతంపేట, విశాఖ రహదారుల్లో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. మితిమీరిన వేగంతో డ్రైవ్ చేసిన వారికి, మద్యం మత్తులో ఉన్నవారికి అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

## ఉజ్వల గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్



జీసీసీ గ్యాస్ గొడౌన్‌లో తనిఖీలు చేస్తున్న జీసీసీ డీఎం మహేంద్రకుమార్

**గుమ్మలక్ష్మీపురం:** ఉజ్వల గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ కోరారు. శుక్రవారం స్థానిక జీసీఎం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి సిబ్బంది, సేల్స్‌మేన్‌లతో మాట్లాడుతూ సీజన్‌ల వారీగా లభించే అటవీ ఫలసాయాల కొనుగోలు, వాటి నాణ్యత ప్రయోజనాలను గిరిజన ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న జీసీఎంఎస్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనులన్నీ చివరి దశలో ఉన్నందున మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్, పెట్రోల్ బంకుతో పాటు జీసీసీ ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను కూడా ఆయన తనిఖీ చేసి, అర్హులందరికీ ఉజ్వల గ్యాస్ పథకం అందేలా చూడాలని తెలిపారు. ఆయన వెంట మేనేజర్ వి.కృష్ణప్రసాదరావు, అకౌంటెంట్ గణపతి, బంక్ ఇన్‌చార్జ్ భాస్కరరావు, గ్యాస్ ఇన్‌చార్జ్ సంగమేష్, తదితరులు ఉన్నారు.

## వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న తెలగ కులస్తులు

**గరుగుబిల్లి:** తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.చంద్రశేఖరరావు, కె.రమేష్ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలో ఉప తహశీల్దార్ పి.ఎస్.ఎల్.కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో 500 తెలగ కుటుంబాలున్నాయని, తామంతా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నామన్నారు. 1962 ముందు వరకు తెలగ కులస్తులకు రిజర్వేషన్ ఉండేదని, ఆ తర్వాత రిజర్వేషన్‌ను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టుస్వామి కమిషన్, మంజునాథ కమిషన్‌లు తెలగ కులస్తులు పేదరికంలో ఉన్నారని, నివేదికను కూడా సమర్పించారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో పి.భార్గవ్, కె.చక్రధర్, ఎం.దిలీప్, కె.రామారావు, అప్పలరాజు తదితరులు ఉన్నారు.

# ఇరిడిలో కుల గణన సర్వే



గరుగుబిల్లి: కుల గణన సర్వేను పరిశీలిస్తున్న నోడల్ అధికారి ప్రభాకరరావు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని ఇరిడి గ్రామంలో కులగణన సర్వే శుక్రవారం నిర్వహించారు. ఈ సర్వేను ఈవోపీఆర్‌డీ జి.జగదీష్‌కుమార్ పరిశీలించి, సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. పక్కాగా సర్వే చేసి, వివరాలు సేకరించాలని, సేకరించిన వివరాలను సంబంధిత యాప్‌లో పొందుపరచాలన్నారు.

**చురుగ్గా కులగణన సర్వే**

**పాలకొండ:** మండలంలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభించారు. గ్రామ స్థాయిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉదయం 9 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారు. ఏడు రకాల వివరాలను తెలుసుకుని యాప్‌లో నమోదు చేశారు. మొదటి రోజు సర్వర్లు కొంతమేర మొరాయించడంతో అధికారులు నివారణ చర్యలు తీసుకున్నారు.

**గరుగుబిల్లి:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను సక్రమంగా నిర్వహించాలని నోడల్ అధికారి ప్రభాకరరావు సూచించారు. మండలంలోని ఉల్లిబద్ర గ్రామసచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న కుల గణనను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలని, సర్వేలోని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తి చేయాలన్నారు. మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే ప్రారంభించడం జరిగిందన్నారు. గరుగుబిల్లిలో సర్వేను మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ నెల 28వ తేదీలోగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



పాలకొండ: కొండాపురంలో కుల గణన సర్వే చేస్తున్న సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: కుల గణన సర్వేను పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ జగదీష్‌కుమార్

**కులగణన ప్రారంభం**

**భామిని:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరి గ్రామాల్లో పర్యటిస్తూ సర్వేను పరిశీలించారు.

## ముగిసిన మండల స్థాయి పోటీలు



క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య



భామిని: కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలో ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శుక్రవారంతో ముగిశాయి. కబడ్డీ (పురుషులు) పోటీల్లో మండ సచివాలయం జట్టు, కబడ్డీ(మహిళలు) పోటీల్లో తాడికొండ సచివాలయం జట్టు విజేతలుగా నిలిచాయి. క్రికెట్ పోటీల్లో ఇరిడి సచివాలయం జట్లు, బ్యాడ్మింటన్(పురుషులు) పోటీల్లో గుమ్మలక్ష్మీపురం సచివాలయం జట్టు, మహిళా విభాగంలో జరిగిన పోటీల్లో ఇరిడి సచివాలయం జట్టు విజేతలుగా నిలిచాయి. ఖోఖో (పురుషులు) పోటీల్లో కొండవాడ జట్టు, మహిళా విభాగంలో పి.ఆమిటి సచివాలయం జట్టు గెలుపొందింది. వాలీబాల్ (పురుషులు, మహిళలు) పోటీల్లో దుడ్డుఖల్లు జట్లు విజేతలుగా నిలిచాయి. విజేత జట్లను ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు అభినందించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో కూడా మరింత బాగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీల కోసం క్రీడాకారులకు క్రీడాసామగ్రిని ఎంపీపీ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

**హోరాహోరీగా..**

**భామిని:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మండల కేంద్రంలో హోరాహోరీగా సాగాయి. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, జీజేసీ గ్రౌండ్స్‌లో జరిగిన మండల స్థాయి సెమీ ఫైనల్స్ పోటీలలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలు ఫైనల్‌కు అర్హత పొందారని క్రీడా కన్వీనర్ శివ రామప్రసాద్ తెలిపారు.

## కాలుష్యనివారణకు అందరూ సహకరించాలి

**సీతానగరం:** మండలంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ ఒకమొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆఫీసు పని మీద వచ్చిన వారికి నీడ, ఫలసాయం వచ్చే మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పెరుగుతున్న వాయు, ధ్వనికాలుష్యాన్ని నివారించడానికి అందరూ ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. ఇప్పటికే కార్యాలయం ప్రాంగణంలో బాదం, కాశీ గంగాభవాని కొబ్బరి మొక్కలు, పూలజాతి, ఆనందాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణం కల్గించే మొక్కలను నాటినట్లు చెప్పారు. కొనుగోలు చేసినవి కొన్ని మొక్కలు కాగా, దాతలు సమకూర్చిన మొక్కలను మరికొన్నింటిని నాటినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, గెడ్డలుప్పి సర్పంచ్ అల్లు తిరుపతిరావు, విశ్రాంత వీఆర్వో ప్రభాకర్, స్థానిక వీఆర్వో కుమారస్వామి, సింహాచలం, ఏఓ ఎస్.అవినాష్ పాల్గొన్నారు.

## చినగీసాడలో జగనన్న ఆరోగ్య సురక్ష



గుమ్మలక్ష్మీపురం: వైద్యశిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది




పాలకొండ రూరల్: రోగులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యులు, నాయకులు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని చినగీసాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి రోగులు వచ్చి, ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా అవసరమైన వారికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య భద్రతే లక్ష్యంగా...**

**పాలకొండ రూరల్:** ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని తుమరాడ సర్పంచ్ పి.శోభారాణి అన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన శిబిరంలో ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి రవి, తదితరులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు వారాడ నాగేంద్ర మాట్లాడుతూ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల్లో ఆరోగ్యశ్రీ, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలు బృహత్తరమైనవన్నారు. జగనన్నను ఎల్ల వేళలా నిండుమనసుతో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ డొంక త్రినాథులు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్న పలువురికి ఉచితంగా కళ్లద్దాలు అందించారు.

## ఆకట్టుకున్న నఖచిత్రం



గరుగుబిల్లి మండలం, నాగూరుకు చెందిన ప్రముఖ నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు గీసిన యోగి వేమన నఖచిత్రం చూపరులను ఆకట్టుకుంటోంది. జనవరి 19న వేమన జయంతి పురస్కరించుకుని, ఈ చిత్రాన్ని వేసినట్లు చిత్రకారుడు తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్.